# జంబాలుగాడి కత

చచ్చి ఏలోకంలో ఉండాడో ఏమోగానీ మా కమలాపొండు చినయ్య మా ఊళ్లో అప్పుడు నా యీడు పిలకాయలందరికి వర్సబెట్టి తమాస తమాసగా తలా ఒక పేరు పెట్టె!

మా మునిమామ కొడుకు రాంకిష్టుడికి పాములనారిగాడని... మా చెంగమ్మత్త పెద్ద కొడుక్కు మిండగాళ్ల మేనత్త మొగుడని... చిన్న కొడుక్కు చింతనీళ్ల బక్కోడని... అయినేరోళ్ల కిష్టుడికి ఆంబోదల గిడ్డడని... నాకేమో అగ్గసేనిపల్లి ఎర్రయ్యని... అదే మా చెంగల్‌పొండు చిన్నయ్య కొడుక్కు జంబాలుగాడని యిట్టా పిలగాడికొక పేరు పెట్టె!

మాటా పలుకు నడకా నాణ్ణెం గెమనించి ఆయన పేర్లు పెట్టె. ఆ పేర్లు ఎవురికి అవిర్నా అమరకుండా పాయ్‌నా జంబాలుగాడి పేరు మాత్రం బెమ్మాండంగా అవిరి పొయ్యింది.

డొలుడస్తు!... పొగులు పస్తు! అనే యవారం జంబాలుగాడిది. మూడు పూట్లకు ఒక పూట తిన్నా... మూడుదుగ్గాండ్లు చేతిలో లేకుండా పాయ్‌నా జంబాలుగాడి జంబం మాత్రం జబల్‌పూర్‌దాకా పొయ్యేది.

జంబం ముందుగా పోతావుంటే జంబాలుగాడు దాని ఎనకాల్నే నడస్తా ఉంటాడు.

''ఒరే నాయినా! ఈ తట్టట్టా తలమింది కెత్తి పోరా!'' అంటే-

''అబ్బబ్బ! అట్టాంటి పని మనం చేస్తామా? గూటం కొండ మిందుండే గాది గుండు ఎత్తే చేత్తో పేడ తట్ట ఎత్తేదా? ఛీఛీ! యిటుమంటి పన్లు మన యింటా వొంటా కూడాలే!'' అంటా ఎచ్చులు పలకతాడు.

''ఒరె వొరే అబ్బారే! పిలగాడికి కడుపు సెగచేసింది. నోటికీ చేతికీ తాళంగా ఉండాది వాడిపని. ఆ టెంకాయి చెట్టెక్కి ఒక్క ఎలనీరు కాయ్ తొయ్‌రా!'' అని బంగపడ్తే-

''చ చ్ఛ! ఎక్కమంటే పులిగుండు ఎక్కమనండి. అలాగ్గా ఎక్కేస్తా. తూ బెహ! ఈ టెంకాయి చెట్టా నేనెక్కేది. ఇటుమంటి చిన్న చిన్న పన్లు మనకు చెప్పద్దంటే యినిపించుకోరే ఈ ఎర్రి నాయాలి గుంపు!'' అని యాష్టపోతాడు.

పొల్లించి పొల్లించి తన్నినా ఆ యదవ దగ్గిర దమ్మిడీ దుడ్లుండవు. మల్లా మాట్లాడేదా? అంతా లచ్చుల మిందే!

తాగేదేమో కళావర్ బీడీ. జేబీలో పెట్టుకుండేదేమో కత్తిర మార్కు సిగరెట్టు పెట్టి!

ఎవురు ఎదటపడ్తే వాణ్ణి యరవలి సిగరెట్టు అడగతానే ఉంటాడు.

ఆ అడిగే దాంట్లో గూడా ఎంత జంబం?

''మొన్ననే తిరపతికి పొయ్యుండి ఒక బండల్ తెచ్చినా. చేతిలో వుంటే నిమిశాని కొగిటి ఊది పారేసేదే గదా మన పని! ఇద్దో యిది లాస్ట్ పెట్టి. దీంట్లో గూడా మూడో నాలుగో ఉండె. ఇప్పుడే ఆ గుంటకట్టమింద తలావొగిటి పెరుక్కుంద్రి. పెట్టుకోని ఎట్ట లేదనేది. ఎదా? ఒక సిగరెట్టు యిట్టా గొట్టు!'' అంటా ఆ కాళీ పెట్టిని యిసిరట్టా పారేస్తాడు.

అప్పుడు మా ఊరికంతా ఒకడే జంబాలుగాడు!

ఇప్పుడా? ఊదికి యిరవైమందికి పైగా ఎదిగిపొయ్‌నారు.

అప్పుడు మావాడి జంబాలు చూసి బతకలేని యదవకు యిదేం బతుక ని చీదరించుకుంటా ఉంటిమి. చీకొట్టా ఉంటిమి. ఈ డంబాశారాల్తో ఈ యదవ ఎట్టా బతకపోతాడబ్బా? అని అనుమానపడ్తా ఉంటిమి!

ఇప్పుడ గదా తెలస్తా ఉండాది! –

ఈ జంబం లేకుండా పోతే బతుకే లేదని... జనంలో మతింపే లేదని! ఎవురినన్నా చూడు. సొంత డబ్బాను కొట్టు కోకుండాబోతే కొంపలో చోటులే. పోనీ కొంపట్టా యిడ్సి పెట్టేసి యీదిలోకి పోతే అంతకుముందు అక్కడా లే!

అప్పు కోసరమన్నా పో. నువ్వు పప్పు కూటికన్నా పో. జంబంగా కార్లో పోతే దాని మతింపే మతింపు. అది బాడిగద్దైతే గూడా పరవాలే. ఎదురుంగా వచ్చి ఎగిరిపడి కావిలించు కుంటారు. అదే కాలి నడకన పో. కసిరి కొట్టారు.

ఈ జంబాల మింద యిట్టా చెప్పుకుంటా పోతే ఓయబ్బా! ఒక బారత మంత చెప్పచ్చు. చెప్పినా యిప్పుడు యినే ఓపిక ఎవురికుండాది? –

ఈ జంబాల గాళ్లతో మాట్లాడ్తే ఒక చిక్కు. మాట్లాడకుండా పోతే ఒక చిక్కు. కర్మగాలి నోరిచ్చినామా? తలకాయి తినేస్తారు. మనకెందుకులే? అని గమ్మునుంటే సీదాగా తినేస్తారు.

ఆ నడమ ఒకనాడు బుద్ధిగెడ్డి తిని ఆ నాలుగ్గాళ్లమండపం కాడ ''పొయ్ పొయ్! ఈ సీమలో అది గూడా ఈ జిల్లాలో పుట్టిమే? పుట్టిన నేరానికి అన్నిట్లో ఎనకబడి పోతా ఉండామే?'' అని నా కడుపు సొద ఎలబోసుకుంటి.

ఈ మాట ఒక జంబాలుగాడి చెవల్లో పొయ్ పడె!

ఇంక నన్ను వాడు మలేసుకున్నాడు చూడు నా సామీ! –

''ఒరే! ఏమి ఏడుపురా మీ ఏడుపు? ఎప్పుడు చూడు ఎనక బణ్ణా మని కొందురు... ముందుకు బోలేదని కొందురు ముక్కుల్తో ఏడ్సే పనేనా? ఆ ఏడుపు పోనీ ఆడికన్నా నిలిపేస్తారా అంటే లేదే! మల్లా కొందురు ఎనక పడాలని. కొందురు ముందుకు పోవల్లని. ఉన్నోడికి అదే ఏడుపు. లేనోడికి అదే ఏడుపు. మీ నోటివాక్కు మీకే తగలకుండా పోదులే. ఎనిక్కి ఎనిక్కి అనుకుంటా ఉండండి. ఎనిక్కే పోతారు.''

''ఏం చెయ్యమంటావు జంబాలూ! ఈ ప్రెబుత్వాలు ముందరుండే వాళ్ల మొకాలే చూడనంటా ఉండాయే?''

''పోనీ! నీ మాట కేవస్తా. ఈ సీమ అన్నిట్లో ఎనకబడి పొయ్యింది గదా? దీని మొకం ఎవురు చూస్తా ఉండారు?''

''అదే గదా మా ఏడుపు. ఎనకుండేవాణ్ణి యింకా ఎనిక్కే అన్నెట్టుగా ఎనికెనిక్కే నెట్టేస్తా ఉండారు. ఈసీమ చేసుకుణ్ణె పాపం ఏమోగానీ...''

''అద్దో అట్టంటేనే నాకు వొళ్లు మండేది. ఆడలేక మద్దిల మింద పడి మొత్తు కుణ్ణెట్టుంది మీ యవ్వారం. 'ఈసీమ పాపం చేసింది! పాపంచేసింది!' అంటారే? మీరన్నెట్టు పాపమే చేసుకోనుంటే ఆ కాశిరాజు కూతురు ఆదిలక్ష్మి యాడ పుట్టె? ఈ జిల్లోలో ఉండే నారాయణవనం లోనే గదా! వైకుంటం లోనుండి ఎలబార్నె వెంకటేశుడు లక్ష్మీదేవిని ఎతుక్కుంటా యాడికొచ్చె? ఈజిల్లాకే వచ్చె. వచ్చినాడే అనుకో. ఇల్లిటానికి వచ్చిన అల్లుడి మాదిర ఈ బూప్రెపంచంలో యింకేడా తావేలేనట్టు ఏడుకొండల మిందనే కొలువు తీరాల్నా? ఆయన కత ఆడికయిందా?

ఇంకొక మొగలాయి చెరసగం వొళ్లే పంచిచ్చేసి నాడు. ఆయనుండేది కాళాస్త్రిలో. ఆయన కొడుకుండేది తిరత్తణిలో. అబ్బాకొడుకులు యిద్దురూ ఈజిల్లాలోనే తిష్టేసినారా?

సరే? అబ్బాకొడుకులు యిద్దురూ కల్సిమెల్సి ఉండేది మన అబ్బలకు పడకుండా తిరత్తణి వదిలేస్తే వదిలేసినార్లే. అట్టన్నా ఆ మహన్నబావుల పేరు చల్లని పూట మల్లామల్లా చెప్పుకుంటారు.

ఈమాదిరగా అడుక్కొక్క దేముడు ఈగెడ్డ మింద ఎలిసుంటే దీన్నే పాపంచేసిన గెడ్డంటావు గదరా పాపిష్టోడా?''

''అవునవును. మన సీమ శానా పుణ్ణెం చేసుకుణ్ణింది. ఈసీమలో జల్మమెత్తిన నువ్వొకపుణ్ణాత్తుడివి. నేనొకపుణ్ణాత్తుణ్ణి. ఇంక మనకేం తక్కువ? అడుగడుక్కి ఒక గుడి... గడప గడపకు ఒక నాయికుడు. నేతులు తాగిన మన తాతల మూతులు... మన బతుకుల కేం జంబాలూ?''

''ఎంతసేపూ బతుకులు బతుకులని మొత్తుకుణ్ణే పనేనా? ఇల్లుచూసి యిల్లాల్ని చూడమన్నారు పెద్దోళ్లు. ఈడ యిల్లంటే మన జిల్లా!

ఒక్కసారి ఎనిక్కి తిరిగి చూడ్రా!

బిటీషోడి కాలంలో చెన్నపట్నం మనతోనే చేరివుండె గదా? అప్పుడు ముక్కెమంత్రి ఎవురో తెల్సునా? బొల్లిని మునసామినాయుడు. యావూరోడో తెల్సునా? తిరత్తణిలో పుట్టి చిత్తూరులో చదువుకుండె. అప్పుడు తరత్తణి ఉండింది చిత్తూరు జిల్లాలోనేగదా? అటుమంటి మొగలాయిలంతా పుట్టిన జిల్లారా యిది.

అదట్లా పోనీలే?

బిటిషోడు పొయ్‌నాక ఉమ్మిడి మదరాస్ రాష్ట్రానికి ముక్కెమంత్రి ఎవురు?

పానగల్లు రాజా!

ఈజిల్లా మణిసేగదా? మహన్నబావుడి పేరుమింద ఎలిసింది పానగల్లు పార్కు. ఇప్పుడంటే అది చెడీబడీవాళ్లను చేరదీస్తా ఉండాది. అది బాగా బతికిన రోజులుగూడా ఉండాయ్‌రోయ్. ఆకాలాన అది రాయలవారి దర్బారేగదా? – రాసేవాళ్లు రాస్తావుంటే... కూసేవాళ్లు కూస్తావుంటే... మేసేవాళ్లు మేస్తావుంటే... సైలెంటగా చూసేవాళ్లు చూస్తావుంటే చెన్నపట్నమంతా చేరేది అణ్ణే గదరా?

అది ఆడికి యిడ్సి పెట్టు.

పానగల్లురాజావారు కాళాస్త్రిలోపుడ్తే మనఅయ్యోరు! అయ్యోరంటే ఎవురంటావ్? గుమ్మిడిపాండు మాదిర్తో గుమ్మటంగా ఉణ్ణే! ఆయనే మాడబూషి అనంతశయనం అయ్యంగారు. యాడ్రా పుట్టింది. చిత్తానూర్లోనే గదా? యాడ్రా చదువుకుణ్ణింది తిరపతి లోనే గదా? మొనగోడు పార్లమెంటులో కూసుంటే నెహ్రూగాదు... పటేల్‌గాదు వాడు ఎటుమంటోడైనా అయ్యోరు మాట్లాడమంటేనే మాట్లాడల్రా!

సరే! యీళ్లందర్నీ ఒక్క తోముతోమి వదల్నాడే మొగలాయి తరిమెల నాగిరెడ్డి! యాడ్రా పుట్టింది? ఈ సీమలోనే అనుకో. అందురి పుణ్ణెమా అని బతికింది మాత్రం జైల్లోనే గదరా?''

''అవున్రా జంబాలు! ఈళ్లేనా యీసీమలో పుట్టింది. పదకవితలకు పాణం పోసిన అన్నమయ్య... ప్రెజాకవి వేమన్న యీడ పుట్నోళ్లే గదా?

ఒకరికి యిద్దురు రాష్ట్రపతులు సర్వేపల్లి... నీలం సంజీవిరెడ్డి యిక్కడోళ్లే గదా? చిలుకూరు నారాయణరావు, దామోదరం సంజీవయ్య, కట్టమంచి రామలింగారెడ్డి, బళ్లారి రాగవ, రాళ్లపల్లి అనంతకిష్ణశర్మ, దర్మవరం కిష్ణమాచార్యులు, కోలాచలం శీనివాసరావు, చిత్తూరు నాగయ్య, హెచ్.ఎం.రెడ్డి, బి.యన్.రెడ్డి, పుట్టపర్తి, గడియారం, శంకరంబాడి యిట్లా మాదిరి ఎందురెందరో బూమిని పుట్టగూడని మహన్నబావులు ఎంతమంది పుట్లా?

తిమ్మక్క, మొల్ల వెంగమాంబ ఈసీమ ఆడపడుచులే కదా?

ఇంక మనకేం తక్కువ? ఈ జంబంతోనే బతికి పోదాం. ఇంక మనకు తాగేదానికి నీళ్లెందుకు? తినేదానికి తిండెందుకు?''

నామాట యింటానే జంబాలుగాడు యాదాంతి మాదిరొళ్ళెఎగ్రిరినవ్వు నవ్వె! సిల్కు జుబ్బాను చిర్నవ్వుతో పలకరించె. మడత నలక్కుండా బుజాన యాలాడ్తావుండే సరిగంచు చవకాన్ని ఒక్కంట గెమనించుకుంటా గువ్వదువ్వులు దువ్వె!

''ఒరే నీజంబం పొయ్ జముల్లల్లో పడా!'' అనుకుంటా ఉంటే వాడు తలపైకెత్తి నాకల్లా చూసె. ఆ చూపు అంతుదొరక్కుండా అవస్తపడ్తా ఉంటే–

''ఒరేపిచ్చోడా! మనప్ప నీలం సంజీవిరెడ్డి కోస్తావాళ్లతో ఏమన్నాడో తెల్సా? తుపాను గిపానులొచ్చి నదులు పొంగి పొర్లినాయంటే ఆ వరదల్లో మీపని గోయిందో గోయింద! మాకేం గోయిందుడి పాదాలకాడ పడి కలింకాయలో... కలబందగెడ్లో... ఉస్తికాయలో... దేవదారాకో... ఎదురుబియ్యమో– ఏదోవొగిటి తింటా బతికి పోతాం. మీమాదిర మాకు చచ్చినా దిక్కులేని చావు రాదు. మేము ఎంత అదురుష్టం చేసినోళ్లం! అనె. అంత పెద్దాయప్ప అంత గొప్ప మాటంటే అందులో సత్తేన్ని మనం అర్తం చేసుకోవాల్రా ఎరిముండా!'' అనె.

''అచ్చిరాలా నిజం ఆమాట జంబాలూ! మన అదురుష్టం ఉండాదే? అంతాయింతా కాదు. ఎందుకంటావా? కాంగ్రెసోళ్ల చేతుల్లో పెత్తనం ఉణ్ణెప్పుడు ఎక్స్‌పార్టీవోళ్ల రాయలసీమో! అని మొత్తుకుంటే కాంగ్రెసోళ్లకు చీమ కుట్టినట్టనిపించిందా? లేదు.

ఇప్పుడు కాంగ్రెసోళ్ల 'సీమ అయ్యోరావమా! సీమ అయ్యయ్యోరావమా! రాయలసీమ!' అంటా కాకిశోకంగా అరస్తా ఉంటే యిప్పుడు పెత్తనం చెలాయిస్తా ఉండే తెలుగుదేశిం వాళ్ల చెవికెక్కతా ఉండాదా? లేదు.

అప్పుడు వాళ్లు అర్సినా యిప్పుడు యీళ్లు ఏడ్సినా అవ్వి నిజిం ఏడుపులైవుంటే మన ఏడుపు యిట్టెందు కుంటింది?''

''ఎవుడు పెత్తనం చేసినా మనకు మాత్రం యిత్తనాల గింజిలకు లాట్రీయే కదా? మారాజుగా ఒక మద్దేణ్ణం బతికి చస్తే చాలు. అడక్క తినే బతుకు ఎంతకాలం బతికితే మాత్రం ఏముండాది? తుపానులొచ్చి నదులన్నీ పొంగి పోతే కోస్తావోళ్లు ఒకదినంతో చస్తారు. మన చావు అట్ట గాదే? దినమూ చస్తా బతకతా ఉండాం.''

యాడుణ్ణాడో ఎట్ట వమా మాట్లు యింటా ఉణ్ణాడో ముత్తారెడ్డన్న వచ్చి ముగతాయింపు పలికె!

ఈసీమలో సీటు సంపాయించుకుణ్ణె మొనగోళ్లు దినమూ చచ్చేవాడికి ఏడ్సేవాడు ఎవుడనుకుణ్ణెట్టుండాది. అందుకేనేమో ఆడికిపొయ్ ఈయేడుపు మల్లా ఏడ్సేదెందుకని తీరుమానం చేసుకుణ్ణారు. ఆ తీరుమానాన్ని తిప్పికొట్టే యదవ ఎవుడుండాడు! ●